# శిథిలం

## ఉర్దూమూలం: మహమూద్ షాహిద్
## అనువాదం: కొల్లూరి సోమశంకర్

**"సార్, మిమ్మల్ని కలవాలని ఓ స్త్రీ వచ్చారు. పేరు మిసెస్ అష్రాఫ్" ఇంటర్‌కమ్‌లో చెప్పింది నా సెక్రటరీ లిల్లీ.**

**'మిసెస్ అష్రాఫ్?' ఈ పేరు కొత్తగా ఉంది నాకు. 'బహుశా కొత్త క్లయింట్ కావచ్చు' అని అనుకున్నాను. "సరే, ఆవిడని కూర్చోమను" అని లిల్లీకి చెప్పి నా ఎదురుగా ఉన్న వ్యక్తితో మాట్లాడడం కొనసాగించాను. ఆయన ఓ ఫైవ్‌స్టార్ హోటల్‌కి అధిపతి. ఆయన హోటల్ ఇంటీరియర్ డెకరేషన్‌కి తుదిరూపు తీసుకొచ్చే ప్రయత్నంలో ఉన్నాము.**

నేను వృత్తిరీత్యా ఇంటీరియర్ డిజైనర్‌ని. నాకో డెకరేషన్ కంపెనీ ఉంది. పనితీరుని బట్టి చూస్తే మాది ఓ ప్రముఖమైన కంపెనీగానే చెప్పుకోవచ్చు. ఫైవ్‌స్టార్ హోటళ్ళు, అద్భుతమైన బహుళ అంతస్తుల వ్యాపార భవనాలు, అందమైన ఇళ్ళు, నగరంలోని అపార్టుమెంట్లు మా ప్రతిభకి సాక్ష్యాలు. నా వృత్తి మరీ సున్నితమైనది. లౌక్యం చాలా అవసరం. మా ఖాతాదార్ల హోదా, అభిరుచులు, ఇష్టాయిష్టాలు వంటి వాటిని సామాజికోణంలోను, మానసిక కోణంలోను చూడగలగాలి. ఏదైనా ప్రాజెక్టులో ఒక తప్పు లేదా ఓ చిన్న పొరపాటు మా సంస్థకు చెడ్డపేరు తెస్తుంది. ఆర్థికంగా ఎలాగు నష్టపోతాం!



ఫైవ్ స్టార్ హోటల్ అధిపతితో సమావేశం ముగిసాక, మిసెస్ అష్రాఫ్‌ని లోపలికి పంపమని ఇంటర్‌కమ్‌లో లిల్లీకి చెప్పాను.

హఠాత్తుగా ఓ అద్భుతమైన పరిమళం నా కాబిన్లోకి ప్రవేశించింది. ఓ అందమైన పూదోటలోకి అడుగుపెట్టిన అనుభూతి కలిగింది. తలుపువైపు ఆశ్చర్యంగా చూసాను. మిసెస్ అష్రాఫ్ లోపలికి వస్తోంది. అందమైన, ఆకర్షణీయమైన మనోహరమైన 'స్త్రీ' ఆమె. నా చూపులామె ముఖారవిందంపైనే నిలిచిపోయాయి. మహిళా ఖాతాదార్లను అలా చూడడం తప్పని నాకు తెలుసు. వెంటనే కళ్ళను కిందకి దించి, నా సీట్లోంచి కొద్దిగా పైకి లేచి, 'కూర్చోండి' అంటూ ఆమెకి కుర్చీ చూపించాను.

"థాంక్స్" అంటూ మర్యాదగా పలికిందామె. ఎవరో సంగీత వాయిద్యాన్ని మంద్రంగా మీటినట్టు, నా చుట్టుపక్కల వాతావరణం సంగీతభరితమైనట్లు నాకనిపించింది.

"చెప్పండి మేడం" అన్నాను గంభీరంగా.

"మా బంగళాని అలంకరించడానికి మీ కంపెనీ సేవలు కావాలి" చెప్పిందామె ఎంతో ఆత్మవిశ్వాసంతో.

ప్లాను కాగితాన్నందిస్తూ "ఇదిగో మా బంగళా ప్లాను" అని అందావిడ ఠీవిగా. దాన్ని నా టేబుల్ మీది గాజు పలకపై పరచి పరిశీలించసాగాను. ప్లింత్ ఏరియా చాలా ఎక్కువగా ఉన్న నిర్మాణమది. గదులు, హాలు ఏర్పాటు, వాటి స్థానాలు చక్కగా కుదిరాయి. ప్లానుని పరిశీలిస్తూ, నేను ఆమెని గమనిస్తున్నాను. ఆమె అందమైన మెడలో తళతళలాడుతున్న నెక్లెస్ ఉంది. ఖచ్చితంగా అది నిజమైన వజ్రాలతో చేసినదే. నిజమైన దానికి, నకిలీకి ఉండే తేడాని సులువుగా గ్రహించే నైపుణ్యం మా వృత్తి నాకు నేర్పింది. సాదా మేకప్, భుజాలదాక వచ్చిన జుట్టు, వంపుసొంపుల మేనిపై ఖరీదైన, ఆ కట్టుకునే దుస్తులు, కుడి మణి కట్టుకున్న బంగారపు కడియం- ఇవన్నీ అసలే అందమైన నా కాబిన్‌ని మరింత అందంగా మార్చేసాయి.

అనువాదకథ

"మీ బంగళా అద్భుతంగా ఉంది"

ఆమె పెదాలపై చిరునవ్వు మిలమిలలాడింది. కనురెప్పల చివర మెరపులు మెరిసాయి. వాళ్ళ భవంతిని కాక, ఆమెనే పొగిడాననుకుందో ఏమో. వృత్తిరీత్యా చెప్పిన మాటల్లా కాకుండా, నిజంగానే ఆ భవనం నమ్మశక్యంకాని విధంగా అందంగా ఉంది.

"మీ బంగళాని చూడాలనుకుంటున్నాను" చెప్పానామెతో.

"తప్పకుండా"

ఈ చిన్న సమాధానంతోనే వాళ్ళ భవంతిని నేను చూడాలని, వాళ్ళ అవసరాలేవో స్వయంగా అర్థం చేసుకోవాలని ఆమె కోరుకుంటోందని నేను గ్రహించాను. వెళ్ళేముందు, వాళ్ళ బంగళాకి ఎలా రావాలో గుర్తులు చెప్పిందామె. తప్పకుండా వస్తానని నేను మాటిచ్చాను. ఇంత అందమైన, తెలివైన, ఆత్మవిశ్వాసం కల మహిళను నేను మునుపెన్నడు చూడలేదు. ఆమె లావణ్యం, ప్రవర్తన, నన్నెంతగా ఆకట్టుకున్నాయంటే- ఎట్టి పరిస్థితులలోను నేనీ ప్రాజెక్టుని వదులుకోదలచుకోలేదు. పైగా ఇటువంటి ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టులు చేపట్టడం మా కంపెనీ స్థాయిని పెంచుతుంది.

** ** **

మర్నాడు నేను మామూలుగానే ఆఫీసుకువెళ్ళాను.

సిబ్బందికి పనులు అప్పజెప్పి, మిసెస్ అష్రాఫ్ ఇంటికి బయల్దేరాను. నిన్నటి దాక నా కారు మీద అంగుళం మేర దుమ్ముండేది. మరి ఈరోజో, శుభ్రంగా కడిగి ఉంది. నాకిష్టమైన సూటు వేసుకున్నాను. నన్ను చూడగానే లిల్లీ చిన్నగా నవ్వింది. ఎలాగైనా మిసెస్ అష్రాఫ్‌కి నాపై మంచి అభిప్రాయం కలిగించాలి. మిసెస్ అష్రాఫ్ వాళ్ళుం దేది ధనవంతులుండే ఖరీదైన ప్రాంతం. అక్కడ భూమి విలువ బంగారంకంటే ఎన్నో రెట్లు ఎక్కువ.

ఈ ప్రాంతంలో ఎందరో ప్రముఖులు, పేరుమోసిన కులీనులు, సుప్రసిద్ధ పారిశ్రామికవేత్తలు, పెద్ద పెద్ద వ్యాపారస్తులు నివాసముంటారు.

ఆ అద్భుతమైన భవంతి ముందాగాను. భవనానికి ఇంకా రంగులు వేయనప్పటికీ, చుట్టుపక్కల ఇళ్ళకంటే ఎంతో ఉన్నతంగా కనిపిస్తోంది. ఆ భవంతి ఇనుపగేటు పక్కగా కారాపి దిగాను. గేటు దగ్గర ఉన్న కాపాలా కుర్రాడు వచ్చి అభివాదం చేసాడు. నేను తలాడించి లోపలికి ప్రవేశించాను. వసారాలో, ఇల్లు శుభ్రం చేస్తున్న పనివాళ్ళకి ఆదేశాలిస్తూ కనపడింది మిసెస్ అష్రాఫ్. నన్ను చూడగానే, "రండి. మీ



కోసమే ఎదురుచూస్తున్నాను" అని అంది చిరునవ్వుతో.

ఆమెతో పాటు బంగళాలోకి నడిచాను. మాతోపాటు ఆమె మేనిపై నుంచి ఓ గమ్మత్తైన సువాసన బంగళాలోకి ప్రవేశించింది.

"ఇది మా డ్రాయింగ్ రూం" అందామె. జేబులోంచి ఓ చిన్న పుస్తకం, పెన్ను తీసి ఆమె చెబుతున్న వివరాలను శ్రద్ధగా రాసుకోసాగాను. క్లయింట్ అవసరాలను గ్రహించడంలో ఓ చిన్న పొరపాటు చాలు, మా వృత్తిలో కష్టాలను కల్పించడంకోసం!

"ఈ గది అలంకరణ అత్యుత్తమంగా ఉండాలి..." ఆమె చెబుతూనే ఉంది.

పక్కనుంచి 'ఢబ్'మన్న చప్పుడు వినిపించింది. ఆమె అక్కడికి గబగబా పరిగెత్తింది. నేను కూడా ఆమెని అనుసరించాను. శుభ్రం చేస్తున్నప్పుడు ఓ పనివాడి చేతిలోంచి బరువైన వస్తువేదో జారి పడింది. అర్ధచంద్రాకారంలో ఉన్న క్రిందిమెట్టు ఓ మూల విరిగింది. అంతే! ఆమె కోపం పట్టలేకపోయింది. ఆమె కళ్ళల్లో నిప్పులు కురిసాయి. ముఖంలోను, మెడపైనా రక్తనాళాలు ఉబికాయి. రక్తం కురుస్తుందేమోననిపించింది. చాలాసేపటివరకు ఆమె మామూలుమనిషి కాలేకపోయింది. అంత అందమైన, సున్నితమైన మాటకారి, దయగల మహిళ- ఇంతగా ఆగ్రహానికి లోనవుతుందని నాకు తెలియదు. ఆమె మనస్తత్వం, అస్పష్ట వైఖరులు మెల్లిమెల్లిగా బహిర్గతం కాసాగాయి.

తిరిగి మేము డ్రాయింగ్ రూంకి వచ్చాం. ఆ గదిలో ఎలాంటి అలంకరణ ఉండాలో ఆమె చెప్పసాగింది. ఇంటీరియర్ డెకరేషన్‌లో ఆమెకి బాగా అవగాహన ఉన్నట్లుంది. ఈ రంగంలో కొత్తగా వచ్చిన మార్పులన్నీ ఆమెకి అవగతమే. ఆమెకి కావలసినవన్నీ ఒకటొకటిగా చెబుతూ, డ్రాయింగ్‌రూం, లివింగ్‌రూం, డ్రెస్సింగ్‌రూం, డైనింగ్ హాల్, కిచెన్, పిల్లలగది... అన్నీ చూపించింది. బెడ్‌రూంలోకి రాగానే ఆమె ముఖంలో మార్పు కనపడింది. క్షణాలలో సర్దుకుని ఆమె మామూలు స్థితికి వచ్చేసింది. ఆ గదికి కావల్సిన అలంకరణ గురించి చెప్పసాగింది.

"ఈ గది స్వర్గాన్ని తలపింపజేయాలి. ప్రతీ వస్తువు అత్యంత కళాత్మకంగా ఉండాలి. గదులు వేరైనప్పటికీ, వాటి అలంకరణలో తేడా ఉన్నప్పటికీ, వాటిమధ్య సారూప్యం ఉండితీరాలి" చెప్పిందామె.

గదిలోంచి బయటకు నడుస్తూ, "గుర్తుంచుకోండి! నాకు అనాకారితనమంటే రోత" అని అందామె యథాలాపంగా.

"మిసెస్ అష్రాఫ్, అవన్నీ నాకొదిలేయండి. మీరు నిశ్చింతగా ఉండండి. అన్నీ మీరనుకున్నట్లుగానే జరుగుతాయి" అని చెప్పాను నేను ఆమె కళ్ళలోకి సూటిగా చూస్తూ.


ఆమెకి కావలసిన డిజైన్లని, అలంకరణలనీ ఓ కొలిక్కి తేవడానికి చాలాకాలం పట్టింది. ఆమెని తృప్తి పరచడం కష్టం. ఆమె తరచూ మనసు మార్చుకుంటుంది. ఆమె ఆలోచనలకి రంగు, రూపు ఇవ్వడానికి చాలా శ్రమించాల్సి వచ్చింది. ఎట్టకేలకు పనులు మొదలుపెట్టడానికి ఆమె అనుమతించింది. రెండు మూడు నెలలవరకు పని చురుగ్గానే సాగింది. ఆమె మా పనిలో కలగజేసుకోడం మాకు ఇబ్బందులు కలిగించింది. ఆమె రోజుకోమారు చేసే ఫిర్యాదులు

**పక్కనుంచి 'ఢబ్'మన్న చప్పుడు వినిపించింది. ఆమె అక్కడికి గబగబా పరిగెత్తింది. నేను కూడా ఆమెని అనుసరించాను. శుభ్రం చేస్తున్నప్పుడు ఓ పనివాడి చేతిలోంచి బరువైన వస్తువేదో జారి పడింది. అర్ధచంద్రాకారంలో ఉన్న క్రిందిమెట్టు ఓ మూల విరిగింది. అంతే! ఆమె కోపం పట్టలేకపోయింది. ఆమె కళ్ళల్లో నిప్పులు కురిసాయి. ముఖంలోను, మెడపైనా రక్తనాళాలు ఉబికాయి. రక్తం కురుస్తుందేమోననిపించింది.**

నాకు విసుగనిపించేవి.

ఆమెకి ఓ అంతులేని సమస్యల చిట్టానే ఉన్నట్టుంది- కిచెన్‌లో టైల్స్ సమతలంగా లేవని, డైనింగ్ టేబుల్ కుర్చీలు ఠీవిగా లేవని, లివింగ్ రూంలో రంగుల కలబోత ఆకర్షణీయంగా లేదని, పిల్లలగదిలో అంటించిన వాల్ పేపర్ వారి మానసిక పరిస్థితికి అద్దం పట్టేలా లేదని, డ్రాయింగ్ రూంలోని ఫాల్స్ సీలింగ్ ఎత్తు ఎక్కువైందని, డ్రెస్సింగ్ రూంలోని అలమారలు, వార్డ్‌రోబ్ అంత ఆకట్టుకోడం లేదని, బెడ్‌రూంలో అమర్చిన అద్దాలు సరైన కోణంలో లేవని, స్విమ్మింగ్ పూల్ వద్ద దీపాలవరుస సరిగా లేదని... ఇలా!

నేనామెకి విడమరచి చెప్పాను-




**ఆమె విభిన్నమైన అభిరుచి, అవగాహన మనస్తత్వం నిస్సందేహంగా గొప్పవే. కాని చీటికి మాటికి మా పనిలో కలగజేసుకోడం నాకు చికాకు తెప్పించేది. మా సిబ్బంది కూడా ఆమెపట్ల విసిగిపోయారు. ఈ ప్రాజెక్టు పూర్తి చేయడానికి ఏడాది పట్టింది.**

పనంతా ఆమె అంగీకరించిన పద్ధతిలోనే జరుగుతోందని, ఇలా ఆమె తరచూ కలుగజేసుకుంటే మరింత ఆలస్యమవుతుందని! ప్రతీ పనికి ఓ పద్ధతి, సూక్ష్మత ఉంటాయంటే వినదాయె. ఆమె ప్రవర్తన అమర్యాదకరంగానూ, రాజీ లేకుండానూ ఉంటోంది. కొన్నిసార్లు మా సిబ్బందిపై కూడా అరవసాగింది.

ఆమె ప్రవర్తన పట్ల విసుగేసి, ఆమె భర్త అష్రాఫ్ షేక్‌గారిని సంప్రదించదలచాను. ఆయనని ముందెన్నడు కలవలేదు. కాని ఆయన పేరు విని ఉన్నాను. నగరంలోని గొప్ప వ్యాపారవేత్తలలో ఆయన ఒకరు. నిస్సందేహంగా ఆయనకి తీరిక ఉండదు. మాకు అడ్వాన్సుగా ఇచ్చిన చెక్కు మీద ఆయన సంతకం చూసాను. చాలా హడావుడిగా చేసినట్లుంది.

ఎన్నోసార్లు ఆయనతో మాట్లాడడానికి ప్రయత్నించి విఫలమయ్యాను. నాకు మిసెస్ అష్రాఫ్ అడిగిందల్లా చేయక తప్పలేదు. ఆమె విభిన్నమైన అభిరుచి, అవగాహన మనస్తత్వం నిస్సందేహంగా గొప్పవే. కాని చీటికి మాటికి మా పనిలో కలగజేసుకోడం నాకు చికాకు తెప్పించేది. మా సిబ్బంది కూడా ఆమెపట్ల విసిగిపోయారు. ఈ ప్రాజెక్టు పూర్తి చేయడానికి ఏడాది పట్టింది.

ఆ ఇంటి గృహప్రవేశం అట్టహాసంగా జరిగింది. నన్ను కూడా పిలిచారు. ఓ ఖరీదైన బహుమతి పట్టుకుని నేనా ఫంక్షన్‌కి హాజరయ్యాను. ఎంతోమంది లబ్ధప్రతిష్ఠులు, పారిశ్రామికవేత్తలు, సామాజిక రాజకీయవేత్తలు, ...ఇంకా గొప్పవాళ్ళెందరో హాజరయ్యారు. మిసెస్ అష్రాఫ్ నన్ను సాదరంగా ఆహ్వానించింది. ఆమె చాలా సంతోషంగానూ, ప్రశాంతంగానూ కనిపించింది. చిరునవ్వుతో బహుమతినందించాను. ఆమె ధన్యవాదాలు తెలిపి, తన భర్తని చూపిస్తూ "మా వారు అష్రాఫ్‌షేక్" అని నాకు చెప్పి, "వీరు షాజాద్ డెకరేషన్ కంపెనీ యజమాని, ఇంటీరియర్ డిజైనర్ షాజాద్‌గారు" అంటూ నన్ను ఆయనకు పరిచయం చేసింది.

నేనిదే మొదటిసారి ఆయనను చూడడం.

ఆయన స్నేహపూర్వకంగా నవ్వారు. నాకు షేక్‌హేండిస్తూ, "మీ పనితీరు అద్భుతంగా ఉంది" అని చెప్పారు.

"అంతా మీ అభిమానం" అన్నాను నేను. మా మధ్య సంభాషణ జరుగుతున్నంతసేపు నేను ఆయనకేసి ఆశ్చర్యంగా చూస్తునే ఉన్నాను. ఇంత అనాకారి మనిషి మిసెస్ అష్రాఫ్‌కి భర్తంటే నమ్మలేకుండా ఉన్నాను.

చిక్కటి నలుపు, బట్టతల, జీవంలేని పెద్దకళ్ళు, దట్టమైన పొడుగాటి ముక్కు, ఎత్తుపళ్ళు... ఆయన స్థూలకాయంపై ఖరీదైన సూటు చూడడానికి చాలా ఎబ్బెట్టుగా ఉంది. నేను మిసెస్ అష్రాఫ్‌కేసి నా చూపులను సారించాను. ఆమె ముఖం మాడిపోయింది. ఒక్కసారిగా తల తిప్పేసుకుంది. వెంటనే ఓ అతిథితో మాటలు కలిపి హఠాత్తుగా బిజీ అయిపోయింది. ఆమె నన్ను తప్పించుకోవాలని చూస్తోందని నాకు తెలుసు. శిథిలమైన అంతరంగాన్ని అందంగా అలంకరించి, ముస్తాబు చేయాలనే నిరంతర తపన ఆమెది. కాని ఆ ప్రయత్నంలో ఆమె ఓడిపోయి, విరిగిన గుమ్మటంలా డొల్లగా కనిపిస్తోంది. ●


## రచయితలకు సూచనలు!

* మీ రచనలను కాగితాలకు ఒకవైపున మాత్రమే రాయాలి.
* జిరాక్స్ కాపీలను పరిశీలనకు స్వీకరించలేం.
* మీ రచనతోపాటు పూర్తి అడ్రసు రాయాలి. పిన్‌కోడ్ నెంబరు తప్పనిసరిగా ఉండాలి.
* అనువాద రచనలకి మూల రచయిత అనుమతి పత్రం జతచేయాలి.
* మీ రచన ఇదివరకు ఎప్పుడూ, ఎక్కడా ప్రచురితం, ప్రసారం కాలేదన్న హామీపత్రం జతపరచాలి.
* ప్రచురించని రచనల్ని తిరిగి పొందాలనుకునేవారు తగినంత పోస్టేజీ స్టాంపులు అంటించిన సెల్ఫ్ అడ్రసు కవరు విధిగా జతపరచాలి.
* రచనల ప్రచురణకు సంబంధించి ఫోన్‌లో ఎలాంటి సంప్రదింపులకు తావులేదు.
* ఆరోగ్యకరమయిన హాస్య, వ్యంగ్య రచనలకి ప్రత్యేక ప్రాధాన్యం ఉంటుంది.

మీ రచనలు పంపించవలసిన చిరునామా:

**ఆదివారం వార్త,**
ఎడిటర్
'వార్త' తెలుగు దినపత్రిక,
లోయర్ ట్యాంక్‌బండ్, హైదరాబాద్- **500 080**